B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 268 | మంగళవారం | 27-10-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



2

‘నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?’

సొంత ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫైర్!

- సొంత ప్రభుత్వంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అసంతృప్తి
- పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్
- 30 వేల మందితో దీక్షకు సిద్ధమని ప్రకటన
- మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులా? అంటూ ప్రశ్న
- సాగునీటి కోసం పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తామని వెల్లడి

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణలో సొంత ప్రభుత్వంపైనే కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లులు విడుదల చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను చస్తే గానీ బిల్లులు చెల్లించరా? అంటూ ప్రశ్నించారు. అవసరమైతే 30 వేల మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన అనిరుధ్‌రెడ్డి సోమవారం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ, గుండ్లపొట్లపల్లి సహా పలు గ్రామాల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలను

ప్రతికూల ప్రభావం లేకపోతే ఓకే

తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర సీఎం సానుకూలం!

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ముంబయిలో చర్చలు జరిగాయి. 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి అంగీకారం తెలపాలని సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రను కోరారు.

మన ప్రజాపక్షం,ముంబయి

తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశంపై ముంబయి వేదికగా తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు సమావేశం జరిగింది. తెలంగాణ నీటి అవసరాలు, వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రను కోరారు. తమ రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం లేకపోతే తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి గతంలో కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు తమకు అభ్యంతరం లేదని, తెలంగాణ నీటి అవసరాలకు సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. కేంద్ర జలసంఘం అధ్యయనంతో పాటు రెండు రాష్ట్రాల అధికారులతో కూడిన కమిటీ అన్ని అంశాలను పరిశీలించాలని ప్రతిపాదించారు. ముంపు, ప్రభావిత ప్రాంతానికి సంబంధించి ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు.తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్ వేదికగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు,



2

నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

ఫడణవీస్ హామీ ఇచ్చారు

తుమ్మిడిహెట్టి ఆనకట్ట ఎత్తు పెంపు అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్?తో చర్చలు చాలా ఫలవంతంగా ముగిశాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం అనంతరం ఎక్స్ వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి తమ ప్రతిపాదనను పెద్ద హృదయంతో పరిశీలించారని ఫడణవీస్?కు కృతజ్ఞతలు చెప్పారు. సాంకేతిక అంశాలతో పాటు ముంపు అంశాలపై అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీ ఏర్పాటు చేసేందుకు



2

త్వరలో ఫైనల్ బిల్లులు!

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త..

- ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు త్వరలో జమ
- లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్న మంత్రి పొంగులేటి
- రూ.40 వేల కోట్లతో 8 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం
- తరువాతి విడతల్లోనూ అర్హులకు ఇళ్ల కేటాయింపు

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నిర్మాణం పూర్తిచేసుకుని ఫైనల్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి త్వరలోనే ఆ మొత్తాన్ని జమ చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఇల్లు పూర్తయినా ఫైనల్ బిల్లు ఇంకా రాలేదని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.రాష్ట్రంలోని నిరుపేదలకు పక్కా గృహాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున, మొత్తం రూ.40 వేల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు.మొదటి విడతలో ఇళ్లు మంజూరు కాని అర్హులైన పేదలు నిరాశ చెందవద్దని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం దశలవారీగా ఈ పథకాన్ని అమలు చేస్తుందని, మూడు, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ప్రకటనతో ఇళ్ల

కాంగ్రెస్‌లో అసహనం

ప్రధాని తండ్రిని ఉద్దేశించి ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

తీవ్రంగా ఖండించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం అని వ్యాఖ్య



2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంతటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత ఇంత దిగజారుడు భాష మాట్లాడటం అత్యంత విచారకరమని అన్నారు. హైదరాబాద్‌లో

‘సర్ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే

తీసుకున్నాం

ఫారం-6ను సవరించలేదు’ సుప్రీంకోర్టులో జుజ అఫిడవిట్



2

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్ణయాలన్నీ ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగా తీసుకున్నారని ఎన్నికల సంఘం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఫారం- 6 ను కూడా సవరించలేదని వివరణ ఇచ్చింది.

సత్యదూరమైన ఆరోపణలు

బీఆర్ఎస్ సత్యదూరమైన ఆరోపణలు చేస్తోంది: ఎంపీ చామల

రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందని చామల ఆరోపణ

రాష్ట్ర ప్రజలపై బీఆర్ఎస్ నేతలకు ప్రేమ లేదని విమర్శ

ఎల్ నినో ప్రభావంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణలో నెలకొన్న కరవు పరిస్థితులపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కేవలం రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నేతలు సత్యదూరమైన విమర్శలు చేస్తున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రజలపై బీఆర్ఎస్ నేతలకు ప్రేమ లేదని, కేవలం రాజకీయాలే వారికి ముఖ్యమని ఆయన



2

హేట్ స్పీచ్ బిల్లును ఉపసంహరించుకోండి

బీఆర్ఎస్ డిమాండ్

రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, రాజకీయ విమర్శలకు విఘాతం కలిగించే విధంగా హేట్ స్పీచ్ బిల్లు ఉందని బీఆర్ఎస్ ఆందోళన వ్యక్తం చేసింది.

2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన హేట్ స్పీచ్ బిల్లును ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. బిల్లులోని పలు నిబంధనలు రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, రాజకీయ విమర్శలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు శాసనసభ సెలక్ట్ కమిటీ ఛైర్మన్?కు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ సవివరమైన మెమోరాండం సమర్పించారు.

స్పష్టమైన నిర్వచనాలు లేవు

హేట్ స్పీచ్, హేట్ క్రైమ్స్‌ను నిరోధించడంలో తమ పార్టీకి అభ్యంతరం లేదని స్పష్టం చేసిన బీఆర్ఎస్ హింసకు ప్రేరేపించే

సెర్చ్ ఆపరేషన్ చేశాం

మారువేషంలో నేపాల్ వెళ్లి సెర్చ్ ఆపరేషన్ చేశాం : సీపీ సజ్జనర్

జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో మాజీ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య హత్య కేసు వివరాలు సీపీ సజ్జనర్ మీడియాకు వెల్లడించారు.

మన ప్రజాపక్షం,హైదరాబాద్

మాజీ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో ఈ ఏడాది మే నెలలో జరిగిన హత్య, దోపిడీ కేసులో ప్రధాన నిందితురాలు కల్పన సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంట్లో పనిమనిషిగా పనిచేసిన కల్పన తన అనుచరులతో కలిసి హత్యకు పాల్పడి, ఆపై దోపిడీ చేసి



2

All are Continues Second Page

సత్యదూరమైన ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కరవు రావాలని బీఆర్ఎస్ నేతలు కోరుకుంటున్నారని, అందుకోసం ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంగితం లేకుండా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. మరోవైపు, రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 28వ తేదీన అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఈ భేటీ జరగనుంది. కరవు నివారణ చర్యలపై అన్ని పార్టీల నుంచి సూచనలు స్వీకరించనున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. ప్రాథమిక అంచనాల ప్రకారం దాదాపు 358 మండలాల్లో కరువు ఛాయలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెలాఖరులోగా కరవు మండలాలను అధికారికంగా ప్రకటించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

హేట్ స్పీచ్ బిల్లును ఉపసంహరించుకోండి

మొదటి పేజీ తరువాయి

ప్రసంగాలు, వ్యక్తులపై దాడులను అరికట్టేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని పేర్కొంది. అయితే, బిల్లులోని నిర్వచనాలు విస్తృతంగా ఉండటం, నేర నిర్ధారణకు స్పష్టమైన ప్రమాణాలు లేకపోవడం, అధికారులకు విస్తృత అధికారాలు కల్పించడం వల్ల చట్టం దుర్వినియోగమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. బిల్లులోని 'హేట్ స్పీచ్', 'శత్రుత్వం', 'ద్వేషం', 'అసౌకర్యం కలిగించే వ్యాఖ్యలు' వంటి పదాలకు స్పష్టమైన నిర్వచనాలు లేవని అభ్యంతరం తెలిపింది. రాజకీయ విమర్శలు, ప్రభుత్వ విధానాలపై అసమ్మతి, మీడియా కథనాలు, ప్రజా సమస్యలపై చర్చలను కూడా నేరాల పరిధిలోకి తీసుకొచ్చే ప్రమాదం ఉందని పేర్కొంది. కేవలం విమర్శాత్మక వ్యాఖ్యలు చేసినంత మాత్రాన వాటిని నేరంగా పరిగణించకూడదని, హింసకు ప్రేరేపించే ఉద్దేశం, నిర్దిష్ట సందర్భం, వాస్తవమైన హాని జరిగే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ సూచించింది.

దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించాల్సిన అవసరాన్ని బీఆర్ఎస్ పేర్కొంది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులను ప్రస్తావించిన ఆ పార్టీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు, రాజకీయ అసమ్మతిని వ్యక్తం చేసే స్వేచ్ఛ కీలకమని పేర్కొంది. బిల్లులో ప్రతిపాదించిన శిక్షలు, అరెస్టు అధికారాలు, ముందస్తు నిరోధక చర్యలపై కూడా బీఆర్ఎస్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. కొన్ని నిబంధనల ప్రకారం నాన్ బెయిలబుల్ నేరాలు, వారెంట్ లేకుండా అరెస్టు చేసే అవకాశం, ముందస్తు నిరోధక ఆదేశాలు అమలులోకి వస్తే అవి రాజకీయ ప్రత్యర్థులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలపై దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ప్రభుత్వ అధికారుల విచక్షణాధికారాలకు పరిమితులు ఉండాలని, అరెస్టులకు స్పష్టమైన కారణాలు, న్యాయపరమైన పర్యవేక్షణ తప్పనిసరి చేయాలని సూచించింది. తప్పుడు లేదా రాజకీయ ప్రేరేపిత ఫిర్యాదులకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల హక్కులను కాపాడాలని పేర్కొంది.

30 రోజుల గడువు ఇవ్వాలి

హేట్ స్పీచ్ బిల్లును యథాతథంగా ఆమోదించకుండా ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ కోరింది. ఒకవేళ బిల్లును కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తే, అందులో సమగ్ర మార్పులు చేయాలని సూచించింది. హింసకు ప్రేరేపించే ఉద్దేశంతో కూడిన ప్రసంగాలకే చట్టాన్ని పరిమితం చేయడం, హేట్ స్పీచ్‌ను ఇతర నేరాల నుంచి స్పష్టంగా వేరు చేయడం, అరెస్టులు, నిరోధక చర్యలకు న్యాయపరమైన రక్షణ కల్పించడం వంటి ప్రతిపాదనలను బీఆర్ఎస్ పార్టీ చేసింది. బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణకు కనీసం 30 రోజుల గడువు ఇవ్వాలని కోరింది. తెలుగు, ఉర్దూతో పాటు ఆంగ్లంలోనూ బిల్లును అందుబాటులో ఉంచాలని జర్నలిస్టులు, న్యాయ నిపుణులు, పౌర సమాజ ప్రతినిధులు, సాంకేతిక రంగ నిపుణుల అభిప్రాయాలను సెలెక్ట్ కమిటీ సేకరించాలని విజ్ఞప్తి చేసింది.

'సర్ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నాం

మొదటి పేజీ తరువాయి

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలు అన్నింటినీ ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులు ఏకగ్రీవంగానే తీసుకున్నారని భారత ఎన్నికల సంఘం సుప్రీం కోర్టుకు తెలిపింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలను తోసిపుచ్చింది. ఇదే సమయంలో సర్ ఉత్తర్వుల ద్వారా ఓటరు నమోదు కోసం ఉపయోగించేటువంటి ఫారం- 6 ను కూడా సవరించలేదని స్పష్టం చేసింది. సీఈసీ పనితీరు, ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని నిర్ణయాల చట్టబద్ధతను సవాలు చేస్తూ రాకేశ్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌కు సమాధానంగా ఈసీ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ దాఖలు చేసిన ఈ అఫిడవిట్‌కు సీఈసీతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కూడా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ప్రచురించిన రిపోర్ట్ ప్రకారం- సర్ ప్రక్రియకు సంబంధించి 14 కీలక నిర్ణయాలు తీసుకునే సమయంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆరోపణలు వచ్చాయి. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి 2025 జూన్ 24, 2025 అక్టోబర్ 27, 2026 మే 14 తేదీల్లో జారీ చేసిన మూడు ఉత్తర్వులు కమిషన్ ఏకగ్రీవ నిర్ణయాలేనని ఈసీ తన తాజా అఫిడవిట్‌లో స్పష్టం చేసింది.

అభిప్రాయాలు, ఆలోచనలన్నీ తుది నిర్ణయాలు కావు!

ఫైళ్ల పరిశీలన సమయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఇతర కమిషనర్లు వ్యక్తపరిచే అభిప్రాయాలు, ప్రశ్నలు, సూచనలు, వ్యాఖ్యలను మాత్రమే కమిషన్ తుది నిర్ణయాలుగా పరిగణించలేమని ఈసీ వివరించింది. సాధారణంగా ఒక ఫైల్ ముందుగా ఒక ఎన్నికల కమిషనర్ వద్దకు, ఆ తర్వాత రెండో కమిషనర్ దగ్గరికి, చివరికి సీఈసీ వద్దకు వెళ్తుందని పేర్కొంది. 2023లో రూపొందించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం, సర్వీస్ నిబంధనలు, పదవీ కాలానికి సంబంధించిన చట్టంలోని సెక్షన్ 18 ను కూడా ఈసీ ఈ సందర్భంగా ప్రస్తావించింది. దీని ప్రకారం- సాధ్యమైనంత వరకు నిర్ణయాలను ఏకగ్రీవంగా తీసుకోవాలని, అలా సాధ్యం కాకపోతే మెజార్టీ ఆధారంగా నిర్ణయం తీసుకోవచ్చని ఎన్నికల సంఘం- సుప్రీం కోర్టుకు తెలిపింది. ఇంకా పిటిషన్‌లోని ఆరోపణలు ప్రధానంగా వార్తా పత్రిక కథనాన్ని ఆధారంగా చేసుకున్నవేనని, పిటిషనర్ సంబంధిత అధికారులతో స్వతంత్రంగా వాస్తవాలను నిర్ధరించుకోలేదని కమిషన్ వాదించింది. అందువల్ల ఈ పిటిషన్ అసలు విచారణకే అర్హత పొందాల్సింది కాదని, ఇంకా తాము అంతర్గత ఫైల్స్ లేదా నోట్స్‌ను మీడియాకు కూడా విడుదల చేయలేదని వెల్లడించింది. కాబట్టి సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరిన పిటిషన్ చట్టబద్ధంగా నిలబడదని ఈసీ వాదించింది.

త్వరలో ఫైనల్ బిల్లులు!

మొదటి పేజీ తరువాయి

నిర్మాణాలు పూర్తి చేసుకుని, తుది చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్న వేలాది పేద కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. త్వరలోనే తమ ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతాయన్న నమ్మకం వారిలో వ్యక్తమవుతోంది.



కాంగ్రెస్‌లో అసహనం

మొదటి పేజీ తరువాయి

మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు... గత పన్నెండున్నర ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో తీవ్రమైన అసహనం కనిపిస్తోందని విమర్శించారు. ఆ నిరాశా నిస్పృహల నుంచే మోదీ తండ్రిని కూడా నిందిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఖర్గే మాట్లాడిన సభలో వేదికపై ఉన్న నేతల కంటే కింద ఉన్న ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీహార్‌లోని పాట్నాలో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా... ఓ వ్యక్తి మోదీ ఓడిపోరంటూ నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' (మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది.

సెర్చ్ ఆపరేషన్ చేశాం

మొదటి పేజీ తరువాయి

నేపాల్‌కు పరారైనట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితులు దేశ సరిహద్దులు దాటి వెళ్లడంతో వారిని పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. దీంతో దాదాపు ఐదు నెలల పాటు మూడు దఫాలుగా నేపాల్‌కు వెళ్లిన ప్రత్యేక పోలీసు బృందాలు స్థానికులతో మమేకమై, రహస్య నిఘా కొనసాగించి నిందితులను పట్టుకున్నాయి. ఈ ఆపరేషన్‌లో కీలకంగా మారిన అంశాలేంటి? నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ఎలాంటి వ్యూహాన్ని అనుసరించారు?అనే వివరాలు సీపీ సజ్జనర్ మీడియాకు వెల్లడించారు.

నేపాల్ వెళ్లి సెర్చ్ ఆపరేషన్ చేశాం

తనూజాను హత్య చేసి ఇంట్లో ఉన్న 225 గ్రా ఆభరణాలు చోరీ చేశారన్న సజ్జనర్ ఈ కేసును ఛేధించడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దింపామని తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు టాస్క్ ఫోర్స్, సీసీఎస్, జూబ్లీహిల్స్ పోలీసులతలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసామని, టాస్క్ ఫోర్స్ డీసీపీ ఆధ్వర్యంలో 25మందితో సిట్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ముంబై, సూరత్, గుజరాత్, యూపీ, ఉత్తరాఖండ్, బీహార్ నేపాల్ బోర్డర్లకు టీమ్స్ పంపామని, నిందితుల వేటలో ఇతర రాష్ట్రాల పోలీసులు, రైల్వే పోలీసులు, బోర్డర్ అధికారులు సహకారం తీసుకున్నామని వివరించారు. పోలీసు బృందాలు మారువేషంలో నేపాల్ వెళ్లి సెర్చ్ ఆపరేషన్ చేశాయని, ఎట్టకేలకు కల్పనతో పాటు నలుగురు నిందితులను పట్టుకున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో మాజీ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య హత్య కేసు తీవ్ర కలకలం రేపింది. ఈ ఏడాది మే 7న ఇంట్లో పనిచేసే నేపాలీ పనిమనిషి కల్పన ఆమె గ్యాంగ్ అర్ధరాత్రి దాటిన తర్వాత, తనూజ రంజన్ ముఖంపై దిండు ఉంచి, ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం ఇంట్లో నగలు, సొమ్ములతో పాటు మృతురాలి ఒంటిపై ఉన్న ఆభరణాలతో సహా దోచుకొని పరారయ్యారు.

'నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?'

మొదటి పేజీ తరువాయి

తెలుసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. తన నియోజకవర్గంలో పూర్తయిన పనులతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులు చెల్లిస్తారా?

ప్రభుత్వం, సచివాలయం తీరుపై అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే బిల్లులు చెల్లిస్తారా? మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ చనిపోయిన తర్వాత ఆయనకు రూ.5 కోట్ల బిల్లు మంజూరు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తన నియోజకవర్గ పనుల బిల్లుల కోసం తాను చనిపోతేనే నిధులు విడుదల చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నీళ్ల కోసం పార్టీలకు అతీతంగా పోరాటం

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు సమానంగా అభివృద్ధి చెందితేనే ప్రభుత్వం నిలబడుతుందని అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు పార్టీలకు అతీతంగా పోరాడతామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ఎంతదూరమైనా వెళతానని చెప్పారు. తన నియోజకవర్గానికి రావాల్సిన నిధులు, పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రతికూల ప్రభావం లేకపోతే ఓకే

మొదటి పేజీ తరువాయి

ఇరువైపులా అంగీకారం కుదిరిందని అన్నారు. మహారాష్ట్ర, అక్కడి ప్రజల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుంటూనే జాతీయ ధృక్పథంతో ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, ప్రత్యేకించి గిరిజనుల జీవితాలను మార్చేందుకు తన వంతు సహకరిస్తానని ఫడణవీస్ హామీ ఇచ్చినట్లు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రతిపాదనలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి

రాష్ట్ర ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. సమావేశం ప్రారంభంలో ప్రజెంటేషన్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని ప్రస్తావించిన ఆయన సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను పేర్కొన్నారు. ఆదిలాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగినప్పటికీ ఆశించిన పురోగతి లేదని తెలిపారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందన్న ఆయన ఆ ఎత్తుతో నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని వివరించారు.

152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట

ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమని, గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అక్కడ అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. వెనుకబడిన అటవీ ప్రాంతమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పేర్కొన్నారు. కుమురం భీం సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాట కాలం నుంచి ఆ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.

గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు

దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదన్న రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నా సీఎం రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందని తెలిపారు. వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్న ఆయన పరస్పర ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. రాష్ట్ర ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన దేవేంద్ర ఫడణవీస్ తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట ఎత్తు పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోమారు పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని మహారాష్ట్ర సీఎం తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు.

ప్రతికూల ప్రభావం లేకపోతే

మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదని ఫడణవీస్ తెలిపారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట విషయంలో కేంద్ర జలసంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని, సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందని అన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలని అన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించి ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు.

గ్లోబల్ సమ్మిట్?కు రావాలని ఆహ్వానం

దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్?లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్?ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన ఫడ్నవీస్ సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.



కలెక్టరేట్‌లో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయంలు ఈ సందర్భంగా మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు. రామాయణంలోని ఆదర్శాలు, ధర్మబద్ధమైన జీవన విధానం, నైతిక విలువలు నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. మహర్షి వాల్మీకి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ఉన్నతమైన విలువలతో జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పాండు, బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, జిల్లా అధికారులు ఉమాపతి, కోటయ్య, సీతారాం, కుల సంఘాల నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం ఏంటి?

ఇది రాజ్యాంగంపై దాడి కాదా?

ఆల్ ఇండియా ప్రొఫెసర్ జయశంకర్ ట్రస్ట్ చైర్మన్ వంగూరు జయశంకర్



నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న అరాచకంపై ఆల్ ఇండియా ప్రొఫెసర్ జయశంకర్ ట్రస్ట్ చైర్మన్ వంగూరి జయశంకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం ఏంటి? ఇది ఆంధ్ర రాజకీయమా, రాజ్యాంగబద్ధమా? అని ఆయన ప్రశ్నించారు. గురువారం మీడియాతో మాట్లాడిన జయశంకర్ రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు ప్రజలు వేసే ఓట్ల ద్వారా నిర్ణయించబడతాయి. ప్రజలే తీర్పు ఇవ్వాలి. కానీ ఇక్కడ బెదిరించి, దాడులు చేసి, బలవంతంగా ఏకగ్రీవాలు చేయడం సరైనది కాదు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని అన్నారు. అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం వైయస్సార్ పార్టీ నేతలపై చెయ్యి చేసుకోవడం, మాజీ మంత్రులను గృహ నిర్బంధం చేయడం, బీ-ఫారాలు బ్లాక్ చేయడం సరైనది కాదు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే" అని జయశంకర్ అన్నారు. అన్ని పార్టీలకు, అందరికీ నామినేషన్లు వేసే హక్కు ఉంది. ఆ హక్కును కాలరాయడం అంటే రాజ్యాంగాన్ని కాలరాయడమే. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి, రాజ్యాంగాన్నే చంపే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇది ముమ్మాటికీ తప్పు అని ఆయన హెచ్చరించారు. ఆంధ్రాలో జరుగుతున్నది చూస్తే తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన అణచివేత గుర్తొస్తోంది. తెలంగాణ సమాజం దీన్ని ఖండిస్తోంది. రాజ్యాంగాన్ని కాపాడాలి, ప్రజల ఓట్లకు విలువ ఇవ్వాలి అని వంగూరి జయశంకర్ పిలుపునిచ్చారు.



విద్యుత్ ఘాతంతో రైతు మృతి...

కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్

చిలుకూరు, మన ప్రజాపక్షం:
చిలుకూరు మండలం రామాపురం గ్రామంలో విద్యుత్ ప్రమాదం విషాదాన్ని నింపింది. బంధువులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద 11 కేవీ విద్యుత్ వైర్ తగలడంతో గన్న నాగార్జున వర్మ (42) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడని తెలిపారు. వివరాల్లోకి వెళితే రామాపురం గ్రామానికి చెందిన గన్న నాగార్జున వర్మ, తండ్రి సర్వేశ్వర వర్మ, సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో తన వ్యవసాయ పొలంలో ఉండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్ తగలడంతో ఆయన విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి గన్న సర్వేశ్వర వర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చిలుకూరు ఎస్ఐ బండి మోహన్‌బాబు తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను విచారణలో తెలుసుకుంటామని ఆయన తెలియజేశారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా కలెక్టర్

100 శాతం ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలి



నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం, డిఆర్ఓ పండు తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ స్వీకరించారు. ఈ సందర్భంగా నేటి ప్రజావాణికి 33 దరఖాస్తులు స్వీకరించారు, ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదుకు ప్రాధాన్యతనిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం జిల్లాలో ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని 100 శాతం అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని శాఖల్లో ఎఫ్ఆర్ఎస్ అమలు పక్కాగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎఫ్ఆర్ఎస్ అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, విధుల నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. శాఖల వారీగా రోజువారి అటెండెన్స్‌ను సమీక్షించిన కలెక్టర్ కొన్ని శాఖల ఎఫ్ ఆర్ ఎస్ పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విధిగా సిబ్బంది 100% ఎఫ్ ఆర్ ఎస్ విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్లు, అంగన్వాడీ కేంద్రం,

కాటన్ మిల్లును పరిశీలించిన జిల్లా కలెక్టర్

కల్వకుర్తి,మన ప్రజాపక్షం:నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండల పరిధిలోని మార్చల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, అంగన్వాడీ కేంద్రం, బాలాజీ కాటన్ మిల్లును జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ



పథకాల అమలు, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, కాటన్ మిల్లు కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు.ముందుగా మార్చల గ్రామంలో ఆవంచ వెంకటయ్యకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఇంటి నిర్మాణం పూర్తయి, లబ్ధిదారుడు అందులో నివాసం ఉంటున్న తీరును పరిశీలించారు. అనంతరం ఇంటి నిర్మాణానికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల వివరాలను వెంకటయ్యను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన బిల్లులన్నీ మంజూరయ్యాయని, ఫైనల్ బిల్లు మాత్రం ఇంకా మంజూరు కాలేదని వెంకటయ్య కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న ఫైనల్ బిల్లు మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు



నిబంధనల ప్రకారం బిల్లుల చెల్లింపులు జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రానికి హాజరవుతున్న చిన్నారులకు అందుతున్న ఆహారం, కేంద్రం రోజువారీ నిర్వహణ, పిల్లలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమైనందున, వారికి అందించే సేవల విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, చిన్నారుల హాజరు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామ పరిధిలోని బాలాజీ కాటన్ మిల్లును జిల్లా కలెక్టర్ సందర్శించి, మిల్లు రోజువారీ



నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. రైతుల నుంచి ప్రతిరోజూ ఎంత పరిమాణంలో పత్తిని సేకరిస్తున్నారు, సేకరించిన పత్తిని మిల్లులో ఏ విధంగా ప్రాసెస్ చేస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. మిల్లులో పత్తి సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్‌కు సంబంధించిన కార్యకలాపాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లు నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తూ, పత్తి సేకరణ ప్రక్రియ, రోజువారీ కార్యకలాపాలపై సంబంధిత మిల్లు యజమాని,సిబ్బందితో చర్చించారు.

బాలల హక్కులే మన భవిష్యత్తు, నా బాల్యం

నా హక్కు అంటూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్ విద్యార్థుల ప్రతిజ్ఞ

అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.అవినాష్

"సురక్షిత్ బచ్‌పన్ అభియాన్" ఘనంగా ప్రారంభం

నారాయణపేట, మన ప్రజాపక్షం:
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన "సురక్షిత్ బచ్‌పన్ అభియాన్" – పోక్సో చట్టం 2012 పై అవగాహన కార్యక్రమం నేడు ఘనంగా ప్రారంభమైంది. మేరా బచ్‌పన్ మేరా అధికార్ – నా బాల్యం నా హక్కు ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్, నారాయణపేట లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి, నారాయణపేట కె.అవినాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి బిడ్డకు చదువుకునే హక్కు, ఆడుకునే హక్కు, సురక్షితంగా ఉండే హక్కు ఉందని, బాలల హక్కులను కాపాడటం మనందరి బాధ్యత అని విద్యార్థులకు తెలియజేశారు. పోక్సో చట్టం 2012 గురించి, మంచి స్పర్శ-చెడు స్పర్శ గురించి, ఏదైనా ఇబ్బంది అనిపిస్తే భయపడకుండా 1098 – చైల్డ్ లైన్, 100 – పోలీస్, 15100 – డిఎల్ఎస్ఏ టోల్ ఫ్రీ కి కాల్ చేయాలి సూచించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ హక్కులపై ప్రతిజ్ఞ చేశారు. డిఎల్ఎస్ఏ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం, ఉచిత న్యాయవాది, మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్, బాధితులకు పరిహారం, బాలల రక్షణ వంటి సేవల గురించి విద్యార్థులకు వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి, బాలలకు, మహిళలకు డిఎల్ఎస్ఏ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పిల్లలకు ప్రత్యేక సూచన చేశారు. ఈ రోజు మీరు తెలుసుకున్న విషయాలను ఇంటికి వెళ్లి మీ తల్లిదండ్రులకు, తోటి స్నేహితులకు తప్పక చెప్పండి. మీ తల్లిదండ్రులకు కూడా డిఎల్ఎస్ఏ సేవలు, హెల్ప్ లైన్ నంబర్లు తెలియజేయండి. మీరు చెబితేనే సమాజంలో అవగాహన పెరుగుతుంది అని జడ్జి పిల్లలకు సూచించారు. విద్యార్థులు నా బాల్యం నా హక్కును కాపాడుకుంటాం అని ప్రతిజ్ఞ చేశారు. తదుపరి రేపు రెండవ రోజు 'కానూన్ జానో బచ్‌పన్ బచావో' అంశంపై కస్తూర్బా గాంధీ విద్యాలయం, యాదగిరి రోడ్డు లో కార్యక్రమం జరుగుతుందని న్యాయమూర్తిగారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.అవినాష్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మిపతి గౌడ్,ఎంఈఓ బాలాజీ, చైల్డ్ డిపార్ట్‌మెంట్ కరిష్మా, అనిత, నర్సిములు, పోలీస్ అధికారి అశోక్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,డిఎల్ఎస్ఏ ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.



పిజీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించిన నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారీ

జనగామ, మన ప్రజాపక్షం:కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని జనగామ చంపక్ హిల్స్ సమీపంలో నిర్మాణంలో ఉన్న పీజీ కళాశాల నూతన భవన పనులను సోమవారం రోజున నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన భవన నిర్మాణ ప్రగతిని సమీక్షించి, పనులను నాణ్యతతో వేగవంతం చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను కోరారు.?భవన నిర్మాణం ఇప్పటికే దాదాపు 90 శాతం వరకు పూర్తయిందని, కేవలం 10 శాతం పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని బిర్రు ఇస్తారీ తెలిపారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కాంట్రాక్టర్‌ను కోరడం జరిగింది. సకల మౌలిక సదుపాయాలతో రూపొందుతున్న ఈ విశాలమైన భవనంలో పీజీ కళాశాలతో పాటు కాకతీయ ఇంజనీరింగ్ కళాశాలను కూడా నిర్వహిస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.



రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించరా?

అధికారిపై కలెక్టర్ ఆగ్రహం..సస్పెన్షన్‌కు ఆదేశాలు

75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందిస్తున్నా రైతుకు తెలియని వైనం

వ్యవసాయ క్షేత్రం,డైరీ ఫామ్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



కల్వకుర్తి, మన ప్రజాపక్షం:
ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన రైతులకు చేరేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందని, అయితే క్షేత్రస్థాయిలో రైతులకు కనీస అవగాహన కల్పించకపోవడంపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పశు పోషణ ద్వారా జీవనోపాధి పొందుతున్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీల గురించి తెలియక, వారు ప్రైవేటుగా అధిక ధరలకు గడ్డి విత్తనాలు కొనుగోలు చేస్తున్న విషయాన్ని గుర్తించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన మండల పశుసంవర్ధక శాఖ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసి, సంబంధిత జిల్లా అధికారికి సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేశారు.కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామంలో సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పర్యటించి రైతులు చేపడుతున్న వ్యవసాయ, పశుపోషణ కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు, వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా వారు పొందుతున్న ప్రయోజనాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.ముందుగా మార్చాల గ్రామానికి చెందిన రైతు తాజుద్దీన్ తన వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసుకున్న ఫామ్ పాండ్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వ్యవసాయానికి నీటి వనరులను వినియోగించుకునేందుకు చేపట్టిన ఈ ఏర్పాటు గురించి రైతును అడిగి వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో చేపడుతున్న కార్యకలాపాలు, నీటి వినియోగం తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు.అనంతరం అదే గ్రామానికి చెందిన రైతు కృష్ణయ్య మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్వహిస్తున్న డైరీ ఫామ్‌ను సందర్శించారు. పశువుల పెంపకం, వాటి పోషణ, పశువులకు అవసరమైన దాణా, పచ్చిమేత అందుబాటు వంటి అంశాలను కలెక్టర్ రైతులు అడిగి తెలుసుకున్నారు. డైరీ ఫామ్ నిర్వహణ ద్వారా రైతు పొందుతున్న ప్రయోజనాలు, పశుపోషణలో ఎదురవుతున్న సమస్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.డైరీ ఫామ్‌ను పరిశీలిస్తున్న క్రమంలో పశువులకు అవసరమైన పచ్చిమేత కోసం గడ్డి విత్తనాలను ఎక్కడి నుంచి సమకూర్చుకుంటున్నారని జిల్లా కలెక్టర్ రైతు కృష్ణయ్యను ప్రశ్నించారు. తాము ప్రైవేటుగా గడ్డి విత్తనాలను కొనుగోలు చేస్తున్నామని రైతు సమాధానమిచ్చారు.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా సబ్సిడీపై గడ్డి విత్తనాలను సరఫరా చేస్తున్నప్పుడు ప్రైవేటుగా ఎందుకు కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ రాయితీని ఎందుకు వినియోగించుకోవడం లేదని ఈ అంశంపై కలెక్టర్ ఆరా తీశారు.అందుకు రైతు స్పందిస్తూ, ప్రభుత్వం నుంచి సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్న విషయం తమకు తెలియదని, ఈ పథకం గురించి సంబంధిత అధికారులు ఎవరూ తమకు సమాచారం ఇవ్వలేదని తెలిపారు.దీంతో రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంలో అధికారుల పనితీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు సరఫరా చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పశుపోషక రైతులకు ఆ సమాచారం తెలియకపోవడంపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే పథకాల గురించి తెలియజేయాల్సిన బాధ్యత అధికారులకు లేదా అని ప్రశ్నించారు.రైతులు పశువుల మేత కోసం అవసరమైన గడ్డి విత్తనాలను ప్రైవేటుగా కొనుగోలు చేస్తున్నప్పుడు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ గురించి వారికి తెలియజేయకపోవడం ఏమిటని సంబంధిత అధికారులను కలెక్టర్ నిలదీశారు. క్షేత్రస్థాయిలో రైతులతో నిరంతరం సంబంధాలు కలిగి ఉండి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వారికి వివరించాల్సిన అధికారులు ఆ బాధ్యతను ఎందుకు నిర్వర్తించలేదని కలెక్టర్ ప్రశ్నించారు.ప్రభుత్వం రైతుల కోసం పథకాలు అమలు చేయడమే కాకుండా, వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు భావించిన మండల పశుసంవర్ధక శాఖ ఏవో డాక్టర్ నాగరాజును సస్పెండ్ చేయాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.వ్యవసాయ శాఖ ఏఈఓ సురేష్ కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ, డైరీ ఫామ్‌ల నిర్వహణ ద్వారా అదనపు ఆదాయం పొందేందుకు ప్రభుత్వం వివిధ పథకాలు, రాయితీలు అందుబాటులోకి తీసుకువస్తోంది. అయితే, ఆ పథకాల గురించి రైతులకు సరైన సమాచారం అందకపోతే వాటి ప్రయోజనాలు ఆశించిన స్థాయిలో అందవు అని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.జిల్లా కలెక్టర్ వెంట సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి, ఎమ్మార్వో ఇబ్రహీం, ఎంపీడీవో యాదయ్య, మార్చాలా పంచాయతీ సెక్రెటరీ రమేష్, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు

మార్చాల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్


నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సందర్శించి, పాఠశాల వాతావరణాన్ని పరిశీలించి, అక్కడి విద్యా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు తీరుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో మొత్తం ఆరుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధతో బోధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు.ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా 54 మంది విద్యార్థులు పాఠశాలలో చేరడంతో, ప్రస్తుతం మొత్తం 106 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. అలాగే, ఈ పాఠశాలలో చదివిన ఆరుగురు విద్యార్థులు



గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందినట్లు వివరించారు. స్థానిక పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుండటంతో విద్యార్థులు ఇక్కడే చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని, విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి అవసరమైన కూరగాయలు ఆకుకూరలను కిచెన్ గార్డెన్ ద్వారా పండించిన ఆకుకూరలను ఉపయోగిస్తున్నట్లు, దాతల సహకారంతో విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకునేందుకు సహకారంతో షెడ్‌ను ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యా వాతావరణాన్ని, విద్యార్థుల అభ్యసన పురోగతిని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పరిశీలించారు.జిల్లా కలెక్టర్ వెంట సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి,ఎమ్మార్వో ఇబ్రహీం, ఎంపీడీవో యాదయ్య, మార్చాలా పంచాయతీ సెక్రెటరీ రమేష్, ప్రజాప్రతినిధులు,మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్ చౌరస్తాలో ఖర్గే దిష్టిబొమ్మ దహనం

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి పట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని, అయితే దేశ అత్యున్నత పదవిలో ఉన్న ప్రధానమంత్రి పట్ల మాట్లాడేటప్పుడు బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించాలని హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు విధానాలు, పాలనకు సంబంధించిన అంశాలకే



పరిమితం కావాలని అన్నారు. ఖర్గే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీనాయకత్వంలో దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజకీయ విమర్శలు చేసే సమయంలో ప్రజాస్వామ్య సంప్రదాయాలను, ఉన్నత పదవుల గౌరవాన్ని కాపాడాలని స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డా. గువ్వల బాలరాజు,బీజేపీ రాష్ట్ర నాయకులు కట్టా సుధాకర్ రెడ్డి, బిజెపి నాయకులు నాగురావు నామాజీ,రాష్ట్ర అధికార ప్రతినిధులు సోలంకి శ్రీనివాస్, దిలీప్ చారి, ఏల్లేని సుధాకర్ రావు,జిల్లా ఇన్‌చార్జి రాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్, బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపులు ప్రారంభం

నవంబర్ 16 వరకు సాధారణ ఫీజు చెల్లింపునకు అవకాశం

జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం::
వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న 2027 పదో తరగతి వార్షిక పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేసిందని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్థులు అక్టోబర్ 30 నుంచి నవంబర్ 16వ తేదీ వరకు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా రూ.125 పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించలేని విద్యార్థుల కోసం ఆలస్య రుసుముతో అదనపు గడువులు కల్పించినట్లు తెలిపారు.పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలు: అక్టోబర్ 30 నుంచి నవంబర్ 16 వరకు రూ.125 (ఆలస్య రుసుము లేదు),నవంబర్ 18 నుంచి డిసెంబర్ 1 వరకు రూ.50 ఆలస్య రుసుముతో,డిసెంబర్ 3 నుంచి డిసెంబర్ 14 వరకు రూ.200 ఆలస్య రుసుముతో,డిసెంబర్ 16 నుంచి డిసెంబర్ 28 వరకు రూ.500 ఆలస్య రుసుముతో జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ ఐడీ, పాస్‌వర్డ్‌ల ద్వారా బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో పరీక్ష ఫీజు చెల్లింపు ప్రక్రియను పూర్తి చేయాలని డిఇఓ రమేష్ కుమార్ సూచించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిర్ణీత గడువులను గమనించి, చివరి నిమిషంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే పరీక్ష ఫీజు చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్ సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కోరారు.





అచ్చంపేట పట్టణంలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

అచ్చంపేట, మన ప్రజాపక్షం:
వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా నేడు అచ్చంపేట పట్టణంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ మాదిగ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామాయణ మహాకావ్యాన్ని రచించి సమాజానికి ధర్మం, నీతి, సత్యం, మానవతా విలువలను చాటిచెప్పిన మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.వాల్మీకి మహర్షి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో ఐక్యత, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహర్షి వాల్మీకి చూపిన మార్గంలో నడుస్తూ భావితరాలకు మంచి విలువలను అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు బల్మూరి జానకి, మండికారి బాలాజీ, మంగ్య నాయక్, రేణయ్య,రవీందర్ నాయక్, రాకేష్ వర్మ,పంబ రాజు,రేవలి భాస్కర్,. చందు నాయక్, గాలిముడి రాము,రవి నాయక్,బాలకృష్ణ యాదవ్,అంజి. తదితరులు పాల్గొన్నారు.



జిల్లా బీజేపీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు సమావేశం

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మహబూబ్‌నగర్-హైదరాబాద్-రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమంపై సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా అర్హత కలిగిన పట్టభద్రులందరూ నవంబర్ 6వ తేదీలోపు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్హత కలిగిన పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీజేపీ మహబూబ్‌నగర్-హైదరాబాద్-రంగారెడ్డి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కో-కన్వీనర్ డా.గువ్వల బాలరాజు పాల్గొన్నారు.బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్,జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, బీజేపీ రాష్ట్ర నాయకులు కట్టా సుధాకర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు సోలంకి శ్రీనివాస్, దిలీప్ చారి, ఏల్లేని సుధాకర్ రావు, జిల్లా ఇన్‌చార్జి రాజు, ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాసు,ఎంఎల్సీ ఎన్నికల జిల్లా కన్వీనర్ జలాల్ శివుడు,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహావిష్కరణ కరపత్రం విడుదల

నవంబర్ 22న అచ్చంపేటలో గద్దర్ అన్న విగ్రహావిష్కరణ సభ

అమ్రాబాద్, మన ప్రజాపక్షం:
ప్రజా యుద్ధ నౌక గద్దర్ అన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని 2026 నవంబర్ 22న అచ్చంపేట పట్టణంలో నిర్వహించనున్న నేపథ్యంలో, కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను అమ్రాబాద్, పదర మండల కేంద్రాల్లో విడుదల చేశారు. అమ్రాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద, మన్ననూరు చౌరస్తాలో కరపత్రాలను ఆవిష్కరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్క బాలకృష్ణయ్య, గద్దర్ విగ్రహ కమిటీ కన్వీనర్ జక్క గోపాల్, పాలమూరు అధ్యయన వేదిక గాజుల లక్ష్మీనారాయణ, పౌర హక్కుల సంఘం నాయకుడు వెంకటేశు, ప్రజా కళాకారుడు ఈ. మల్లేష్, మహేంద్రనాథ్ యువజన సంఘం నాయకులు రాజేందర్ ,యువ నాయకులు అనిల్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.గద్దర్ అన్న విగ్రహావిష్కరణ సభకు ప్రజా కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఉద్యమకారులను తక్షణమే విడుదల చేయాలి

కేసులు ఉపసంహరించుకోవాలి.. గుర్తింపు ప్రక్రియ ప్రారంభించాలి

తెలంగాణ ఫ్రీడమ్ ఫైటర్ శ్రీనివాస్ డిమాండ్



నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసి, సుదీర్ఘ పోరాటాలు చేసిన ఉద్యమకారుల హక్కులను ప్రభుత్వం కాపాడాలని తెలంగాణ ఫ్రీడమ్ ఫైటర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని, వారిపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు.తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఇకపై జాప్యం చేయరాదన్నారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించి, అర్హత ప్రమాణాలు, గుర్తింపు విధానంపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులందరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తూ అధికారిక ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.అర్హులైన ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ. 25 వేల పెన్షన్, ఆరోగ్య బీమా, ఉచిత రవాణా సదుపాయాలు కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల త్యాగాలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించి, వారి సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.



ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

నారాయణపేట, మన ప్రజాపక్షం

:ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 11 ఫిర్యాదులు అందాయి. జిల్లాలో వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ ను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మన ప్రజాపక్షం

వాల్మీకి మహర్షి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:నాగర్ కర్నూల్ మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామ ప్రజలు, వాల్మీకి మహర్షి భక్తులు, నాయకులు, యువకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మర్రి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి భారతీయ సంస్కృతి, సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.వాల్మీకి మహర్షి రచించిన రామాయణం భారతీయ సమాజానికి ధర్మం, సత్యం, న్యాయం, త్యాగం, కర్తవ్యం, మానవీయ విలువలను బోధించే మహోన్నత ఇతిహాసమని తెలిపారు. రామాయణం కేవలం ఒక ఇతిహాసం మాత్రమే కాదని, కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు, ఆదర్శ జీవనం, సమాజంలో ధర్మబద్ధంగా నడుచుకోవాల్సిన మార్గాన్ని చూపించే గొప్ప గ్రంథమని వివరించారు.సంస్కృత సాహిత్యంలో వాల్మీకి మహర్షిని ఆదికవిగా గౌరవిస్తారని,



ఆయన రచించిన రామాయణం తరతరాలకు స్ఫూర్తినిస్తూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో విశిష్ట స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. సీతారాముల ఆదర్శ జీవనం, శ్రీరాముని ధర్మనిష్ఠ, లక్ష్మణుని సోదరప్రేమ, హనుమంతుని భక్తి వంటి విలువలు నేటి తరానికి కూడా ఎంతో అవసరమని తెలిపారు.వాల్మీకి మహర్షి జీవితం మనిషిలో మార్పు తీసుకురాగల ఆత్మపరిశీలన, పట్టుదల, తపస్సు, జ్ఞాన సాధనకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనలు, మంచి ప్రవర్తన, పరస్పర గౌరవం, ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన బోధనలు తెలియజేస్తాయని పేర్కొన్నారు.మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం అనేది వారి జ్ఞాపకాలను స్మరించుకోవడమే కాకుండా, వారి ఆశయాలను భావితరాలకు అందించే గొప్ప కార్యక్రమమని మర్రి జనార్ధన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా యువత వాల్మీకి మహర్షి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్య, విజ్ఞానం, క్రమశిక్షణ, సేవాభావంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.గుడిపల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు గ్రామాల్లో ఆధ్యాత్మిక చైతన్యంతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే వారికి మనం అందించే నిజమైన గౌరవమని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా వాల్మీకి మహర్షి బోధనలు మరింత మందికి చేరాలని, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఐకమత్యంతో అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వాల్మీకి సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో

విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో నాడు నాగర్ కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు నందు సురక్షిత్ బచ్పన్ అభియాన్ ఏ పాన్ ఇండియా స్కూల్ అవేర్నెస్ క్యాంపెయిన్ గురించి విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిహారిక, సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నాగర్ కర్నూల్ హాజరై మాట్లాడుతూ సురక్షిత్ బచ్పన్ అభియాన్ అనేది భారతదేశంలో పిల్లల రక్షణ, హక్కులు మరియు వారి భద్రతను పెంపొందించడం కోసం ఉద్దేశించిన ఒక ముఖ్యమైన కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు దేశవ్యాప్తంగా పిల్లల అక్రమ రవాణా మరియు బలవంతపు బాల కార్మిక వ్యవస్థను అరికట్టడం.చిన్న పిల్లలపై జరిగే లైంగిక దాడులు, వేధింపులను అడ్డుకోవడం మరియు (పోక్సో) చట్టంపై పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం. ప్రతి బిడ్డకు స్వేచ్ఛగా చదువుకునే, ఆడుకునే సురక్షితమైన వాతావరణాన్ని అందించడం. పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ (మంచి స్పర్శ – చెడు స్పర్శ)



గురించి వివరిస్తారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098 పిల్లల అత్యవసర రక్షణ కోసం ఉపయోగించుకోవాలి అన్నారు.ప్రతి ఒక్కరు చట్టాల పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలి అన్నారు. ఈ విధంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం వల్ల సమాజంలో నేరాలు జరగకుండా అరికట్టవచ్చు అన్నారు.విద్యార్థులకు బాల్య వివాహాలు, పోక్సో చట్టం గురించి గురించి వివరించారు. విద్యార్థి దశ అనేది భవిష్యత్తుకు బంగారు బాట వంటిది కాబట్టి విద్యార్థులు అందరూ జీవితంలో గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువుకోవాలి అన్నారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీరామ్ ఆర్య గవర్నమెంట్ లాయర్, శ్రీశైలం గౌడ్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాల కోసం పోరాడిన చేతులు..

నేడు న్యాయం కోసం నినదిస్తున్నాయి

కోవిడ్ సేవలు మరువొద్దు...ఎన్హెచ్ఎం ఉద్యోగులకు న్యాయం చేయాలి:డా. బాలకృష్ణ

ఉద్యోగ భద్రత కల్పించాలి.. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి:దామగట్ల కుమార్

నాగర్‌కర్నూల్, మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్హెచ్ఎం ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె సోమవారం 14వ రోజుకు చేరుకుంది. కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజారోగ్య సేవలందించిన ఎన్హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.కరోనా ప్రారంభ దశలో పిపిఈ కిట్లు, మాస్కులు, గ్లౌజుల కొరత వంటి ఇబ్బందులు ఎదురైనా ఉద్యోగులు ఇంటింటి ఫీవర్ సర్వేలు, కరోనా లక్షణాల గుర్తింపు, ఆరోగ్య



అవగాహన కార్యక్రమాలు, ఇతర ప్రజారోగ్య సేవలను అంకితభావంతో నిర్వహించారని తెలిపారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేశారని గుర్తుచేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డా. బాలకృష్ణ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగులు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.జిల్లా ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాల కోసం పనిచేసిన ఉద్యోగులు నేడు తమ హక్కుల కోసం పోరాడాల్సి రావడం బాధాకరమన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్హెచ్ఎం ప్రతినిధులు హైమవతి, డా. రామకృష్ణ, డా. రాజు, డా. మహతి, చంద్రకళ, రజియా తదితరులు పాల్గొన్నారు.

“ఓట్ బచావో - దేశ్ బచావో” రచ్చబండ కార్యక్రమం


నవంబర్ 1న ఢిల్లీలో రాంలీలా మైదానంలో జరిగే భారీ నిరసనకు తరలిరావాలి

ఎల్ నినోపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని గెలిపించాలి

జనగామ, మన ప్రజాపక్షం:

ఏఐసీసీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న “ఓట్ బచావో – దేశ్ బచావో” రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్ ఫేజ్-××× కార్యక్రమంపై జనగామ జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ అధ్యక్షతన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐసీసీ పరిశీలకులు కేబీఆర్ నాయుడు మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ఓటు చోరీపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ఓటర్ల జాబితాలో అక్రమంగా మార్పులు, తొలగింపులు జరిగే అవకాశం ఉందని ఆరోపించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు.ఓటర్ల జాబితా పర్యవేక్షణ, శుద్ధీకరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఓటు చోరీకి సంబంధించిన అంశాల్లో ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ వైఫల్యంపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు సమాన విలువ ఉందని, ప్రజల ఓటు హక్కును కాపాడటం ప్రతి రాజకీయ పార్టీతో పాటు ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. “ఓటు హక్కును కాపాడుకోవాలి – ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి” అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు.కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, రాహుల్ గాంధీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి ని గెలిపించాలని ప్రజలకు, పట్టభద్రుల ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.టీపీసీసీ కోఆర్డినేటర్ అరికెల నర్సారెడ్డి మాట్లాడుతూ ఓటు చోరీ, సీట్ చోరీ వంటి అక్రమాలకు పాల్పడుతూ బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రజలు గమనించాలని కోరారు. గ్రామ స్థాయి నుంచి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజలకు ఈ అంశాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు.ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి ని గెలిపించాలని కోరారు. జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉందని, రాబోయే ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న భారీ నిరసన కార్యక్రమానికి జనగామ జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.అలాగే ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం, దాని వల్ల ప్రజలపై పడే ప్రభావాలపై గ్రామస్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ఫేజ్-3లో భాగంగా ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాను పరిశీలించాలని పిలుపునిచ్చారు. అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.స్టేషన్ ఘనపూర్ ఎస్ఐఆర్ ప్రక్రియ ఇన్‌చార్జ్ దుద్దిళ్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఓటు చోరీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ ఓటు చోరీ, అవకతవకలకు సంబంధించి జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా భారతీయుల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయడమేనని అన్నారు.అదేవిధంగా ఎల్ నినో ప్రభావం, దాని వల్ల సంభవించే



వాతావరణ మార్పులు, ప్రజలపై పడే ప్రభావాలపై గ్రామస్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ సూచించారు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సంబంధిత అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జనగామ మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, సర్ పాలకుర్తి ఇంచార్జి ప్రమోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి, కంచ రాములు, డాక్టర్ రాజమౌళి, పట్టణ అధ్యక్షులు దోర్నాల వెంకటేశ్వర్లు,డీసీసీ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, కొత్త కరుణాకర్ రెడ్డి,కేసర దిలీప్ రెడ్డి, ఉడత రవి,అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు వేముల మల్లేష్, బడికే ఇందిరా, లోకుంట్ల ప్రవీణ్,మజీద్ అప్సర్,జాయ మల్లేష్, ఆర్టీఏ మెంబర్ అభి, మేకల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి ధర్మమార్గాన్ని బోధించిన ఆదికవి వాల్మీకి మహర్షి

రామాయణం మానవ జీవనానికి మార్గదర్శకం

జెడ్పీ సీఈవో శ్రీనివాస్ రావు, డీఆర్డీవో వెంకట్ రాములు




నారాయణపేట, మన ప్రజాపక్షం:
ఆదికవి వాల్మీకి మహర్షి రచించిన రామాయణం కేవలం ఒక ఇతిహాసం మాత్రమే కాదని, మానవ జీవన విధానానికి దిశానిర్దేశం చేసే మహత్తర గ్రంథమని నారాయణ పేట జిల్లా పరిషత్ సీ ఈ వో శ్రీనివాస్ రావు, డీఆర్డీవో వెంకట్ రాములు పేర్కొన్నారు.నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ సీఈవో శ్రీనివాస్ రావు, డీఆర్డీవో వెంకట్ రాములు ముఖ్య అతిథులుగా హాజరై వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సాహిత్యానికి, సంస్కృతికి, మానవతా విలువలకు విశేషమైన సేవలందించిన మహనీయుడు ఆదికవి వాల్మీకి అని కొనియాడారు.వాల్మీకి మహర్షి రచించిన రామాయణం తరతరాలుగా ప్రజలకు సత్యం, ధర్మం, న్యాయం, త్యాగం, కర్తవ్యనిష్ఠ, సహనం, మానవత వంటి ఉన్నత విలువలను బోధిస్తోందని తెలిపారు. మనిషి కుటుంబంలో ఎలా మెలగాలి, సమాజం పట్ల ఎలాంటి బాధ్యతలు నిర్వర్తించాలి, కష్టాలను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలి, ధర్మబద్ధమైన జీవనాన్ని ఎలా కొనసాగించాలి అనే అంశాలను రామాయణం చక్కగా వివరిస్తుందని పేర్కొన్నారు.శ్రీరాముని జీవితం కర్తవ్యనిష్ఠకు, సత్యసంధతకు, ధర్మపాలనకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. తల్లిదండ్రులను గౌరవించడం, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం, కుటుంబ బంధాలను కాపాడుకోవడం, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి ఆదర్శాలను రామాయణం ద్వారా ప్రతి ఒక్కరూ నేర్చుకోవచ్చని వివరించారు. లక్ష్మణుని సేవాభావం, భరతుని సోదరప్రేమ, హనుమంతుని భక్తి, అంకితభావం వంటి లక్షణాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం, ఆయన రచనలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తినిస్తాయని ముఖ్య అతిథులు పేర్కొన్నారు. యువత విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, నిజాయితీ, పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత వంటి లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. రామాయణంలోని ఆదర్శాలను జీవితంలో ఆచరిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించుకోవడం అంటే ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం మాత్రమే కాదని, ఆయన రచించిన రామాయణంలోని సందేశాలను మన జీవన విధానంలో భాగం చేసుకోవడమే నిజమైన నివాళి అని తెలిపారు. సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం, సేవాభావాన్ని పెంపొందించుకుంటూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, హౌసింగ్ పీడీ శంకర్, జిల్లా పౌర సంబంధాల అధికారి రషీద్, స్థానిక మున్సిపల్ కమిషనర్ శంకర్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు బోయ లక్ష్మణ్, సంఘం నాయకులు, న్యాయవాది వెంకట్ రాజ్, శరణప్ప, మాజీ కౌన్సిలర్ బోయ రమేష్, దేవేందర్, శేఖర్, బోయ బుగ్గప్ప, ఆనంద్ కుమార్, డ్రైవర్ ఆంజనేయులు, హుస్సేన్, సత్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

ఓటరు దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



నారాయణపేట, మన ప్రజాపక్షం:
ఎస్ఐఆర్-2026 ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటరు దరఖాస్తుల పరిష్కారం, సంబంధిత రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసుల ప్రక్రియను వచ్చే వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలను తగిన ఆధారాలతో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో తిరస్కరణకు గురైన దరఖాస్తుల విషయంలో తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా పేర్కొంటూ తప్పనిసరిగా స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేయాలని ఆదేశించారు.ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను నవంబర్ 5వ తేదీలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. బూత్‌స్థాయి అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు తమ కార్యాలయాల్లో ఎస్ఐఆర్-2026కు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహిస్తూ భద్రపరచాలని సూచించారు.శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఫారం--18 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. శాసనమండలి ఎన్నికలకు సంబంధించిన నివేదికను పత్రికలు, ప్రసార మాధ్యమాలకు అందించడంతో పాటు సహాయ ఎన్నికల నమోదు అధికారులు, నియమిత అధికారుల కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని ఆదేశించారు.ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తూ, ఓటర్ల జాబితాల నిర్వహణలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ప్రక్రియలో సహకరించాలి

అదనపు కలెక్టర్ శ్రీను



నారాయణపేట, మన ప్రజాపక్షం:
నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) హాల్‌లో సోమవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ల జాబితాకు సంబంధించిన వివిధ అంశాలు, నోటీసుల విచారణ, పరిష్కార ప్రక్రియ, ఓటర్ల వివరాల్లో ఉన్న తప్పుల సవరణ, ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో నమోదైన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఫోటోలు తప్పుగా నమోదైన అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. సంబంధిత సమస్యలను గుర్తించి, నిబంధనల ప్రకారం వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఓటర్ల జాబితాకు సంబంధించి జారీ చేసిన నోటీసుల విచారణ, వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన విధానాలను సమావేశంలో వివరించారు. నోటీసులకు సంబంధించిన అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, నిర్ణీత ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఓటర్ల జాబితాలో కొంతమంది ఓటర్ల ఫోటోలు తప్పుగా నమోదైన అంశంపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఓటర్ల వివరాలు సక్రమంగా ఉండటం, అర్హులైన ప్రతి ఓటరుకు సంబంధించిన సమాచారం తప్పులు లేకుండా నమోదవడం ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఫోటోలు, ఇతర వివరాలకు సంబంధించిన తప్పులను గుర్తించి, నిబంధనల ప్రకారం సరిచేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునే విధానం, దరఖాస్తు ప్రక్రియలో అనుసరించాల్సిన పద్ధతులపై కూడా సమావేశంలో చర్చించారు. అర్హులైన వారు నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలియజేయడం ద్వారా అర్హులైన వారు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు.ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగానికి రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ శ్రీను కోరారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన సమస్యలు, సందేహాలు, అభ్యంతరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి సహకరించాలని సూచించారు.ఈ సమావేశం ద్వారా ఓటర్ల జాబితా నిర్వహణ, నోటీసుల పరిష్కారం, ఫోటోల సవరణ, ఎమ్మెల్సీ ఓటరు నమోదు వంటి అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారిని జయసుధ, బీఆర్ఎస్ నాయకులు కే.సుదర్శన్ రెడ్డి, బీజేపీ నాయకులు కెంచి శ్రీనివాస్, టిడిపి నాయకులు రాఘవ చౌదరి, సీపీఎం నాయకులు వెంకట్రామ్ రెడ్డి, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పల్లా భరోసా..!

రోగులను ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా

వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే

పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ వైద్య సేవలు అందించడమే లక్ష్యం

జనగామ, మన ప్రజాపక్షం:
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జనగామ నియోజకవర్గ ప్రజలకు నీలిమ ఆస్పత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందు కు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి కృషి చేస్తున్నారు. ఎన్నికల్లో విజయం సాధించినప్పటి నుంచి పలుమార్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నియోజకవర్గ ప్రజలను పరామర్శిస్తూ వారికి భరోసా కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఘట్కేసర్‌లోని నీలిమ ఆస్పత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న నియోజకవర్గ ప్రజలను పరామర్శించి ఆప్యాయంగా పలకరించారు.ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 'ఆరోగ్యం ఎలా ఉంది? వైద్యం సక్రమంగా అందుతోందా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా?' అని ఆప్యాయంగా పలకరిస్తూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులతో మాట్లాడి రోగుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందిస్తున్న చికిత్స, వైద్య సేవల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జనగామ నియోజకవర్గ ప్రజలకు నీలిమ ఆస్పత్రి ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాను. ఆధార్ కార్డు ఉంటే చాలు..ఆస్పత్రిలో చికిత్స పొందవచ్చు..పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ వైద్య సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటాను. ప్రజల ఆరోగ్యమే నా ప్రాధాన్యం అని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.



లబ్ది గ్రామానికి గర్వకారణం ప్రకృతి హౌజేకర్



బాసర,మన ప్రజాపక్షం:
నిర్మల్ జిల్లా బాసర మండలం లబ్ది గ్రామానికి చెందిన ప్రకృతి శంకర్ హౌజేకర్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించి సత్తా చాటారు.నీట్ పరీక్షలో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 1831వ ర్యాంకు సాధించి, నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ప్రవేశానికి అర్హత సాధించారు.హైదరాబాద్‌లో పదో తరగతిలో స్కూల్ టాపర్‌గా నిలిచి,నీట్‌లోనూ ప్రతిభ కనబరిచి వైద్య విద్యలో అడుగుపెడుతున్న ప్రకృతికి హృదయపూర్వక అభినందనలు. ప్రకృతి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి, వైద్య రంగంలో మరింత పేరు సంపాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ అధ్యక్షులు సాయిలు దాదా మైసేకర్, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పాటిల్, రమేష్ బాబు వాఘ్మారే, ప్రభాకర్ జోంధలే, తానూర్‌కు చెందిన భీమారావు పవార్, బెల్లూరుకు చెందిన గంగాధర్ కాంబ్లే, లబ్ది గ్రామ పెద్దలకు ప్రత్యేక అభినందనలు. లబ్ది గ్రామానికి గర్వకారణంగా నిలిచిన ప్రకృతికి శుభాకాంక్షలు తదితరులు తెలిపారు.

కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు మంజూరు చేయాలి

నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి విజ్ఞప్తి



జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ నియోజకవర్గానికి కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ విద్యాలయాన్ని త్వరగా మంజూరు చేయాలని నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి కేంద్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా విజ్ఞప్తి చేశారు. ?జనగామ ప్రాంతం విద్య, ఉపాధి రంగాల్లో తీవ్రంగా వెనుకబడి ఉందని ఆయన పేర్కొన్నారు. సరైన విద్యావకాశాలు, ఉద్యోగ సాధన కోసం ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థులు ఇతర నగరాలకు వలస వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం నుండి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి అవసరమైన ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు.పాఠశాలల ఏర్పాటుకు కావలసిన అన్ని రకాల మౌలిక సదుపాయాలు జనగామలో అందుబాటులో ఉన్నాయని బిర్రు ఇస్తారి స్పష్టం చేశారు.ఈ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వం స్పందించి కేంద్రీయ, నవోదయ విద్యాలయాలను త్వరితగతిన మంజూరు చేయాలని జనగామ విద్యార్థుల తరఫున కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి హృదయపూర్వకంగా ప్రార్థిస్తూ విజ్ఞప్తి చేశారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యత

ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చట్టపరిధిలో తక్షణ చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్ నగర్, మన ప్రజాపక్షం:
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి చట్టపరిధిలో పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డి.జానకి ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, బాధితులకు న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. తమ సమస్యలను చెప్పుకోవడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులను ఓపికగా విని, సమస్య స్వభావాన్ని బట్టి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ఫిర్యాదుల స్థితిగతులను సమీక్షిస్తూ పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. బాధితులకు న్యాయం అందిస్తూ, ప్రజల్లో పోలీస్ శాఖపై మరింత విశ్వాసం పెంపొందించేలా విధులు నిర్వర్తించాలని సూచించారు.ప్రజలకు న్యాయం అందించడం, బాధితుల సమస్యలను పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన కర్తవ్యం అన్నారు.

బాసర ఐఐఐటిలో నీటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు

రెండు, మూడు రోజుల్లో విద్యార్థులకు భౌతిక తరగతులు ప్రారంభిస్తాం
జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

బాసర,మన ప్రజాపక్షం:
బాసర ఐఐఐటి (ఆర్జియుకేటీ)లో విద్యార్థులకు నీటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బాసర ఐఐఐటిను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఐఐఐటి లో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిపి పదివేల మంది వరకు ఉంటారని, వారికి తాగునీరు, రోజువారి అవసరాల నిమిత్తం ప్రతి రోజూ దాదాపు15 లక్షల లీటర్ల వరకు నీరు కావాలని అన్నారు. గోదావరి నది వద్ద ప్రత్యేకంగా ఐఐఐటి కోసం 60 హెచ్ పి సామర్థ్యం గల మూడు మోటార్లు అందుబాటులో ఉండగా, వాటిలో ప్రస్తుతం ఒకటి పూర్తిస్థాయిలో పని చేయగా, రెండు పనిచేయడం లేదని అన్నారు. ఈ విషయం తమ దృష్టికి రాగానే రెండు మోటార్ల మరమ్మత్తుల కొరకు 8 లక్షల రూపాయలను కేటాయించినట్లు వివరించారు. ఇప్పటికే సంబంధిత సాంకేతిక నిపుణుల బృందం ఇంటెక్ వెల్ ను సందర్శించిందని తెలిపారు. పది రోజుల్లోనే రెండు మోటార్లను బాగు చేసి నీటి సరఫరాకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఒక మోటారు దాదాపు రోజుకు 25 లక్షల లీటర్లను సరఫరా చేయగలదని వివరించారు. ఈ నీరు ఐఐఐటి రోజువారీ అవసరాలకు సరిపోతుందని చెప్పారు.పెరుగుతున్న నీటి అవసరాలు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మరొక నూతన మోటార్ ను త్వరలోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఐఐఐటి అవసరాలకు ఇంకనూ నీరు అవసరమైతే రోజుకు 10 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయగలిగే సామర్థ్యం ఉన్న గ్రామపంచాయతీ ఇంటెక్ వెల్ నుంచి 1.3 నుంచి 1.5 ఎంఎల్ డి నీటిని అందిస్తామని అన్నారు. అంతేకాకుండా గ్రామపంచాయతీ నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.ఐఐఐటి ప్రాంగణంలో 29 ఎకరాల విస్తీర్ణంలో నీటి నిల్వ కుంట అందుబాటులో ఉందని, దాని ద్వారా కూడా ఐఐఐటి అవసరాలకు ఉపయోగపడుతుందని అన్నారు. ప్రస్తుతం ఆ కుంటను శుభ్రం చేసి మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.ప్రస్తుతం నీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు లేవని, విద్యార్థులకు రెండు, మూడు రోజుల్లోనే భౌతిక తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంటనే భౌతిక తరగతులు ప్రారంభించేలా సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు రోజువారి నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. నీరు తగినంత



లభ్యంగా ఉందని, నీటి సరఫరా లోనే కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.అంతకుముందు గోదావరి నది వద్ద గల ఐఐఐటికి నీటిని సరఫరా చేసే ఇంటెక్ వెల్ ను పరిశీలించారు. నీటి సరఫరా కు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెండు మోటార్లకు అవసరమైన పరికరాలను తెప్పించి, వీలైనంత త్వరగా మరమ్మతులను పూర్తిచేయాలని అన్నారు.ఆ తర్వాత ఐఐఐటి ప్రాంగణంలోని నీటి కుంటను, పంపు హౌస్ ను పరిశీలించారు.ఈ కార్యక్రమాల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, గ్రిడ్ డిఈఈ, ఈఈ లు రాజేశ్వర్ రావు రాఘవేంద్ర రెడ్డి, తహసీల్దార్ పవన్ చంద్ర,ఎంపిడివో దేవేందర్ రెడ్డి, ఐఐఐటి డీన్ లు మహేష్, విఠల్, విద్యార్థి సంక్షేమ అధికారి నాగరాజు, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కోడలి వేధింపులు... ఇబ్బందులకు గురవుతున్న అత్త,మామ

నర్సంపేట, మన ప్రజాపక్షం:వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన కొండ్లే దివ్య వరంగల్ శివనగర్ కు చెందిన మచ్చ పవన్ లకు 2022ఆగస్టు నెలలో పెద్దలు నిశ్చయించిన వివాహం జరిగింది. వివాహం జరిగిన తరువాత మూడు నెలలు వీరి జీవితం సజావుగా సాగింది. ఆ తరువాత కుటుంబంలో గొడవలు జరగడం వలన తాను చెప్పినట్టు ఇంట్లో వాళ్ళు అందరూ నడుచుకోవాలి తనకి బయట తిరగడం బైట ఫుడ్స్, సినిమాలకు షికార్లకు తిరగాలని భర్త పవన్ ను వేధించడం మొదలు పెట్టింది. పవన్ నాకు బయట తిరగడం, తినడం ఇష్టం ఉండదు ఏది కావాలన్నా ఇంట్లోనే చేసుకుందాం అని బదులు చెప్పడంతో మీ అక్క ఇంట్లో ఎలా ఉంటుంది వారి పిల్లలు ఇక్కడ ఉండటం వల్లనే నువ్వు నన్ను పట్టించుకోవడం లేదు అని గొడవ చేసేది. తరచూ ఏదో ఒక గొడవ చేస్తూ ప్రశాంతత లేకుండా పోయింది పవన్ కు తల్లి మరియూ తండ్రి భర్తను కోల్పోయిన తన అక్క తన ఇంట్లో ఉండటం తాను ఓర్చుకోలేక పోయింది. నువ్వు లండన్లో జాబ్ చేస్తా అని అనడం వల్ల మా అమ్మ నాన్న నీకు వర కట్నం కింద ముప్పై లక్షల విలువ గల ప్లాట్ ఇచ్చి పెట్టుడు పోతలు అన్ని పెట్టారు కానీ నువ్వు నన్ను ఇక్కడే ఉంచుతున్నావ్ అని గొడవ చేయగా నీకు విసిటింగ్ వీసా మీద లండన్ వెళదాం అని చెప్పగా నాకు విసిటింగ్ వీసా వద్దు పర్మినెంట్ వీసా అయితేనే వస్తా అని తల్లి ఇంటికి వెళ్ళిపోయింది. ఆ తరువాత తాను చెప్పిన విధంగానే తాను ఆరు నెలల తరువాత తాను లండన్ వెళ్లి తనకు పది నెలల తరువాత తనకు వీసా పంపించగా తాను లండన్ వెళ్లి దివ్య వెళ్లిన నెల రోజుల తరువాత తన చెల్లి పెళ్లి కుదరడం వల్ల తనకు వరకట్నం కింద ఇచ్చిన ప్లాట్ మరియూ తన చెల్లి కోసం పక్కనే ఉన్నటువంటి ప్లాట్ కావడం వల్ల కొనే వారు మొత్తం జాగా అయితేనే కొంటా అనగా తనని ఇండియాకు తిరిగి రప్పించారు.తనకి తిరిగి వచ్చిన తరువాత ప్లాట్ అమ్మగా వచ్చిన 40లక్షలు రాగ అందులో మీరు దివ్య వీసా కొరకు 30లక్షలు ఖర్చు అయినవి కావున ఆ డబ్బులు తీరిగి ఇచ్చినారు. మిగతా 10లక్షలు దివ్య అకౌంట్ లొ వేసుకొనినది తన తండ్రి కాన్సర్ పెషెంట్ అయినందు వలన తనను చూసుకోవాలని అలాగే తనకు పిల్లలు కలగడం గురుంచి ట్రీట్మెంట్ గురుంచి ఇక్కడే ఉండిపోతుంది. పవన్ కుటుంబ సభ్యులు దివ్యకు ట్రీట్మెంట్ చూపించిన తాను సహకరించక పోయేది ఆతరువాత 2025 లొ దివ్య తండ్రి గొంతు కాన్సర్ తో మరణించడంతో అదీ కూడా నా మీద బెంగతోనే గుండె జబ్బుతో అని అత్తింటి వారిపై నింద వేసింది. ఇక తాను ఇక్కడే ఉండి ఇక నువ్వు నాకు వద్దు అని పోలీస్ స్టేషన్ లొ కేసు పెట్టడం జరిగింది. ఆ తరువాత అత్త మామ ఆడబిడ్డపై మహిళా పోలీస్ స్టేషన్ లొ గృహహింస కేసు నమోదు చేయించింది.కేసులకు గురి చేస్తూ వేధింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురి చేసేది. ఇప్పుడు తన ఆడబిడ్డ అయిన మార్తా ప్రశాంతి వారి మామ అయినా మార్తా శేఖరయ్య తన మనవళ్ళు కు నర్సంపేటలో ప్లాట్ 2021తన మనవళ్లపై రేజిస్ట్రేషన్ చేపించారు. ఇప్పుడు తన ప్లాట్ చదును చేపించుకొనుటకు ప్రశాంతి వారి కుమారులు వెళ్లగా వారిపై దాడికి పాల్పడుతూ వారిని ఇబ్బందులకు గురి చేస్తూ కుటుంబం మొత్తం చంపేస్తా అని తన స్నేహితులతో చర్చించడం వల్ల వీరు ప్రాణ భయంతో మీడియాను ఆశ్రయించి న్యాయం చేయాలని వేడుకున్నారు.



పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపై జనగామ నాయకులతో సమీక్ష
నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలి
బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బండ శ్రీనివాస్

జనగామ, మన ప్రజాపక్షం:
వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జనగామ నియోజక వర్గ ఇన్చార్జి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బండ శ్రీనివాస్ పార్టీ శ్రేణులకు సూచించారు. అర్హులైన పట్టభద్రులందరికీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ తమ పేరును నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. సోమవారం జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో



ఏర్పాటు చేసిన సమా వేశంలో జనగామ మండల, పట్టణ బీఆర్ఎస్ నాయకులతో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులను గుర్తించడం, ఓటరు నమోదుకు అవసరమైన సమాచారం అందించడం, నమోదు ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం చేయడం వంటి అంశాలపై చర్చించారు.పట్టభద్రుల ఓటరు నమోదులో ఎలాంటి అర్హులు మిగిలిపోకుండా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవగాహన కల్పిం చాలని బండ శ్రీనివాస్ సూచించారు. మండల, పట్టణ స్థాయిలో సమ న్వయంతో పనిచేస్తూ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవసరమైన సహ కారం అందించాలని పార్టీ నాయకులకు సూచించారు.ఈ సమావేశంలో పట్టణ తాళ్ల సురేష్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ లు గాడిపెల్లి ప్రేమలతా రెడ్డి, పోకల జమున, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బుషా పర్వతాలు, కౌన్సిలర్ లు దుర్గాప్రసాద్, పానుగంటి సువార్త, పార్టీ నాయకులు కదిరే రాజశేఖర్ రెడ్డి, సమద్, అనిత, మామిడాల రాజు, రావెల రవి, మల్లే శం, కృష్ణ, కొమ్ము రాజు, శారద, నీలా యాదగిరి, ఇరుగు సిద్దులు, బిజ్జల నవీన్, ధర్మపురి శ్రీనివాస్, అన్వర్, దండు ఉపేందర్, సలీం వార్డు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదు

టీడీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి
అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి
మర్రిపల్లిలో టీడీపీ అభ్యర్థులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం


పొదలకూరు,మన ప్రజాపక్షం:
స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాజయం తప్పదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. సోమవారం పొదలకూరు మండలంలోని మర్రిపల్లి గ్రామంలో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్ రెడ్డి, బిరదవోలు ఎంపీటీసీ అభ్యర్థిణి అన్నలూరు సుమలతతో కలిసి ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించి, టీడీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. గత వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా వైసీపీ నాయకులు రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.సర్వేపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని సోమిరెడ్డి స్పష్టం చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే స్థానిక సంస్థల్లోనూ టీడీపీ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు.పొదలకూరు జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్ రెడ్డి, బిరదవోలు ఎంపీటీసీ అభ్యర్థిణి అన్నలూరు సుమలతను భారీ మెజార్టీతో గెలిపించి టీడీపీ సత్తా చాటాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయం ఖాయమని సోమిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.





రక్తదానం - ప్రాణదానంతో సమానం
ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ యూనుస్

జనగామ, మన ప్రజాపక్షం:
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఏఐఎస్ఎఫ్ జనగామ జిల్లా కార్యదర్శి మహమ్మద్ యూనుస్ రక్తదానం చేశారు.ఈ సందర్భంగా మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర సమయాల్లో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న ఎంతోమంది ప్రాణాలను రక్తదానం ద్వారా కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.సమాజ సేవలో విద్యార్థి సంఘాలు ముందుండాలని, ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.



లింగంపల్లి తోపులో వైసీపీ ఎన్నికలలో ప్రచారం

?పొదలకూరు, మన ప్రజాపక్షం:
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి, ఆశీస్సులతో, మాజీ మంత్రి కాకాణి. గోవర్ధన్ రెడ్డి, అశీసులతో ఎంపీటీసీ అభ్యర్థి బిట్-4,దాసరి కల్పన. విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం దూడల. శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుంటి. శ్రీనివాసులు, మాట్లాడుతూ మండలంలో మేము ఎక్కడికి వెళ్ళినా ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ప్రజల్లోకి వెళు ్న్న సమయంలో వారి ఆశీస్సులు, మద్దతు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నాటి అభివృద్ధి, సంక్షేమ పాలనను గుర్తుచేసుకుంటూ ప్రజలు మాకు అండగా నిలుస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో జెడ్పీటీసీతో పాటు 19 ఎంపీటీసీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వైసీపీ నాయకులు,మాజీ సర్పంచ్ మల్లికచిటమ్మా, మాజీ వార్డు మేంబార్ చెమికల వెంకీ యాదవ్, అనుమాల. వెంకటరామిరెడీ, శ్రీనాద్ రెడ్డి, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



మహర్షి వాల్మీకి ఆశయాలు, ఆదర్శాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం
డీసీఆర్బీ డీఎస్పీ ఏ. మహేష్

నారాయణపేట, మన ప్రజాపక్షం:
మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని నారాయణపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో డీసీఆర్బీ డీఎస్పీ ఏ. మహేష్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి సంస్కృతంలో ఆదికావ్యమైన రామాయణాన్ని రచించి ప్రపంచానికి ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను చాటిచెప్పారని పేర్కొన్నారు. శ్రీరాముడి జీవిత విశేషాల ద్వారా సమాజానికి నైతిక విలువలు, ఆదర్శవంతమైన జీవన విధానం, కర్తవ్యనిష్ఠ వంటి గొప్ప సందేశాలను అందించారని తెలిపారు.మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన బోధించిన విలువలను ఆచరణలో పెట్టి సమానత్వం, సోదరభావం, సామాజిక సామరస్యంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల జయంతులను జరుపుకోవడం ద్వారా వారి ఆశయాలను భావితరాలకు అందించడంతో పాటు వారి సేవలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్ముడు రిజర్వ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ.. పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన

అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా ఘనంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం

ఆధునిక పోలీస్ వ్యవస్థ, సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన

మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి



మహబూబ్ నగర్, మన ప్రజాపక్షం:
అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ కవాతు మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డి.జానకి ప్రారంభించి, పోలీస్ శాఖకు సంబంధించిన వివిధ విభాగాల పనితీరు, పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, ఆధునిక దర్యాప్తు విధానాలు, రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ తదితర అంశాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ పోలీస్, బాంబ్ డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్, భరోసా కేంద్రం,షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, పోలీస్ కళాబృందం, కమ్యూనికేషన్ విభాగం, ఫింగర్‌ప్రింట్ యూనిట్, క్లూస్ టీమ్, సైబర్ క్రైమ్/డి4సి,స్పీడ్ గన్, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు,ఆయుధాలు-మందుగుండు సామగ్రి, డయల్ 112/పిసిఆర్ తదితర విభాగాలు తమ విధులకు సంబంధించిన పరికరాలు, వాహనాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించాయి.పోలీసులు నేరస్థలాల వద్ద ఆధారాలను ఎలా సేకరిస్తారు, వేలిముద్రల ద్వారా నేర పరిశోధన ఎలా చేపడతారు, బాంబు బెదిరింపుల సమయంలో డిబి టీమ్ ఎలా స్పందిస్తుంది, డాగ్ స్క్వాడ్ సేవలు ఎలా ఉపయోగపడతాయి, సైబర్ నేరాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలను సంబంధిత అధికారులు విద్యార్థులకు వివరించారు.అలాగే ట్రాఫిక్ నియమాల పాటింపు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, మహిళలు మరియు చిన్నారుల భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, ఆన్‌లైన్ మోసాల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పోలీస్ శాఖలో ఉపయోగించే ఆధునిక పరికరాలు, వాహనాలను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించి, వివిధ విభాగాల అధికారులను సందేహాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ పోలీస్ శాఖ విధులు, బాధ్యతలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారు చూపిన సేవాభావం, అంకితభావాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో నేరాల నివారణకు పోలీసులతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను తెలుసుకోవడంతో పాటు, ప్రజల భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన పెరగడంతో పాటు, పోలీసుల సేవలు, సవాళ్లు, ప్రజల భద్రతలో వారి పాత్ర గురించి తెలుసుకునే అవకాశం లభించింది.జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రత, నేరాల నియంత్రణతో పాటు యువతలో చట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది.ఈ క్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్,డిఎస్పీ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, ఇతర ఇన్స్పెక్టర్లు,ఆర్ఐ లు కృష్ణయ్య, నగేష్, ఇతర సిబ్బంది పట్టణం లోని వివిధ కళాశాలల మరియు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మహర్షి వాల్మీకి ఆశయాలు సమాజానికి మార్గదర్శకం

మంచి ఆలోచన, ఆత్మపరిశీలనతో జీవితంలో గొప్ప మార్పు సాధ్యం: జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్ నగర్, మన ప్రజాపక్షం: మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన రచించిన రామాయణం తరతరాలకు ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను బోధిస్తోందని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి అన్నారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకల సందర్భంగా ఎస్పీ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జీవితం పరివర్తనకు ప్రతీక అని పేర్కొన్నారు. పురాణ కథనాల ప్రకారం, రత్నాకరుడిగా ఉన్న సమయంలో దారి దోపిడీలకు పాల్పడిన ఆయన, సప్తర్షుల బోధనలతో తన జీవితాన్ని విశ్లేషించుకుని సన్మార్గాన్ని ఎంచుకున్నారని తెలిపారు. నిరంతర తపస్సు, సాధనతో మహర్షిగా ఎదిగి, రామాయణ మహాకావ్యాన్ని రచించి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని వివరించారు.మనిషి గతంలో చేసిన తప్పులను గుర్తించి, వాటిని సరిదిద్దుకుంటూ మంచి మార్గంలో నడవాలని నిర్ణయించుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని వాల్మీకి జీవితం చాటిచెబుతోందన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన, క్రమశిక్షణ, నైతిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని సూచించారు.మహర్షి వాల్మీకి బోధనలు నేటి సమాజానికి కూడా ఎంతో ప్రాసంగికమని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా మంచి సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఎస్పీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

SPORTS

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు బుమ్రా, పంత్ రెడీ.. ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆడే ఛాన్స్!



స్పోర్ట్స్ డెస్క్: న్యూజిలాండ్‌తో జరగనున్న టెస్ట్ సిరీస్‌కు భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ సన్నద్ధమవుతున్నారు. త్వరలో మైదానంలోకి దిగేందుకు ఈ స్టార్ ప్లేయర్లు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు న్యూజిలాండ్ 'ఏ' జట్టుతో నవంబర్ 7 నుంచి 10 వరకు లింకన్ వేదికగా జరగనున్న మూడో అనధికారిక టెస్టులో బుమ్రా బరిలోకి దిగే అవకాశాలున్నట్లు ఓ స్పోర్ట్స్ నివేదిక వెల్లడించింది. అలాగే పంత్ కూడా బీసీసీఐ వైద్య బృందం ఇచ్చే ఫిట్‌నెస్ క్లియరెన్స్‌ను బట్టి ఈ మ్యాచ్‌లో ఆడే అవకాశం ఉందని తెలిపింది.ప్రస్తుతం బుమ్రా, పంత్ బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. అక్టోబర్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన జట్టులో సభ్యుడిగా ఉన్న బుమ్రా, ఆ తర్వాత వైట్-బాల్ సిరీస్‌లకు విశ్రాంతి తీసుకున్నాడు. తిరిగి జాతీయ జట్టులోకి ప్రవేశించే ముందు తప్పనిసరిగా పూర్తి చేయాల్సిన 'రిటర్న్-టు-ప్లే' ప్రక్రియలో భాగంగా అతడు ప్రస్తుతం సీవోఈ శిక్షణ శిబిరంలో ఉన్నాడు. నవంబర్ 1న బుమ్రా న్యూజిలాండ్‌కు బయలుదేరనున్నాడు.మరోవైపు, అక్టోబర్ తొలి వారంలో జరిగిన ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టును విజయపథంలో నడిపించిన రిషభ్ పంత్.. ఆ సమయంలో అతడి పక్కటెముకలకు స్వల్ప గాయమైంది. దీంతో రంజీ ట్రోఫీ మ్యాచ్‌లు, న్యూజిలాండ్ 'ఏ' జట్టుతో తొలి రెండు అనధికారిక టెస్టులకు పంత్ దూరమయ్యాడు. ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రత్యేక శిక్షణ శిబిరంలో పంత్ తేలికపాటి బ్యాటింగ్ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. అయితే పంత్ న్యూజిలాండ్‌తో జరగనున్న టెస్ట్ మ్యాచ్‌లో పాల్గొనడం పూర్తిగా మెడికల్ టీమ్ ఇచ్చే నివేదికపై ఆధారపడి ఉంటుందిభారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్ వేదికగా తొలి టెస్టు, నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లో రెండో టెస్టు జరగనున్నాయి. ఈ కీలక సిరీస్‌కు ముందు ఈ ఇద్దరు కీలక ఆటగాళ్లు ప్రాక్టీస్ మ్యాచ్ ద్వారా ఫామ్ అందుకోవడం జట్టుకు సానుకూలాంశమని క్రీడానిపుణులు అభిప్రాయాపడుతున్నారు.

ప్రమాదకర పిచ్‌పై కోహ్లీ పట్టుదల గురించి డుప్లెసిస్ ఆసక్తికర వ్యాఖ్యలు!



స్పోర్ట్స్ డెస్క్: టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ పోరాట పటిమ, గెలుపు విషయంలో రాజీ పడని వ్యక్తిత్వానికి సంబంధించి సౌతాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వాండరర్స్ వేదికగా సౌతాఫ్రికా-భారత్ మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో కోహ్లీ ప్రదర్శించిన నాయకత్వ శైలీ గురించి తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో డుప్లెసిస్ గుర్తుచేసుకున్నాడు.పాడ్‌కాస్ట్‌లో డుప్లెసిస్ మాట్లాడుతూ.. గతంలో భారత్-సౌతాఫ్రికా మధ్య వాండరర్స్ వేదికగా జరిగిన ఓ టెస్ట్ మ్యాచ్‌లో పిచ్ అత్యంత ప్రమాదకరంగా మారిందని అన్నాడు. ఆ మ్యాచ్‌లో డీన్ ఎల్గర్‌కు హెల్మెట్‌పై బలమైన బంతి తగిలిందని, ఆ పిచ్ వేగం చూస్తుంటే 'ఇక్కడ ఎవరో ఒకరు చనిపోయేలా ఉన్నారు' అనిపించిందని డుప్లెసిస్ వెల్లడించాడు. బంతులు గొంతు భాగానికి, తలకు తగిలేంత ప్రమాదకరంగా పిచ్ మారిందని, అలాంటి సమయంలో కూడా విరాట్ కోహ్లీ తన జట్టు ఆటగాళ్లకు నిర్దేశించిన కఠిన వ్యూహం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచిందని డుప్లెసిస్ తెలిపాడు.ఆ మ్యాచ్‌లో భారత్ కొంత ఆధిక్యంలో ఉంది.. మ్యాచ్ ఎలాగైనా గెలవాలనే కసితో కోహ్లీ ఉన్నాడని డుప్లెసిస్ తెలిపాడు. పిచ్ పరిస్థితిని చూసి బ్యాటర్లు ఎవరూ కూడా శరీరానికి బంతి తగిలినప్పుడు నొప్పితో ఎలాంటి రియాక్షన్ ఇవ్వకూడదని కోహ్లీ ఆదేశించినట్లు అతడు వెల్లడించాడు. అలా కోహ్లీ చెప్పడానికి కారణం.. ప్రత్యర్థికి బలహీనతను చూపించరాదన్నదే ఉద్దేశమని తెలిపాడు. చేతికి, గ్లౌజులకు లేదా తలకు తగిలినప్పటికీ ఎలాంటి బాధను బయటపెట్టకుండా భారత ఆటగాళ్లు ఎంతో పట్టుదలతో క్రీజులో నిలబడ్డారని డుప్లెసిస్ ప్రశంసించాడు.మైదానంలో కోహ్లీ ప్రదర్శించే ఈ అసాధారణ దూకుడు, పట్టుదల సహచర ఆటగాళ్లలోనూ అంతులేని పోరాట పటిమను నింపేవని డుప్లెసిస్ కొనియాడాడు. మాటల కంటే చేతలతోనే నాయకత్వం ఎలా వహించాలో కోహ్లీ తన కెప్టెన్సీ ద్వారా నిరూపించాడని అతడు పేర్కొన్నాడు. ధోనీ నుంచి పగ్గాలు చేపట్టిన తర్వాత టీమిండియా టెస్ట్ క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన (40 విజయాలు) కెప్టెన్‌గా కోహ్లీ రికార్డు సృష్టించాడు. ఈ విజయాల వెనుక ఉన్న అసలు రహస్యం ఈ దృఢ సంకల్పమేనని వాండరర్స్ టెస్ట్‌లో జరిగిన ఈ సంఘటన మరోసారి రుజువు చేసింది.